క్లుప్తంగా

దైవచింతనతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఏడుగుళ్ల పోచమ్మ ఆలయంలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు.

పరిశుభ్రత అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ కిషన్, అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): వందరోజుల ప్రణాళికలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని బొల్లారం మున్సిపల్ కమిషనర్ కిషన్ అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహిస్తున్న భువన్ సర్వేలో భాగంగా నగర పరిధిలోని ప్రతి ఇంటికి జీఈఓ ట్యాగింగ్ కార్యక్రమం పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని డెంగ్యూ, మలేరియా వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. వైఎస్ఆర్, కేజీర్ కాలనీల్లో స్వచ్ఛ ఆటో మాత్రమే తడి పొడి చెత్తను వేయాలని సూచించారు. స్వచ్ఛ బొల్లారం దిశగా ప్రతి ఒక్కరు అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు, ఆర్వో నర్సింలు, మేనేజర్ మల్లికార్జున్‌రావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

నారాయణఖేడ్: జనవరిలో నిర్వహించిన ఆర్ట్ లోయర్ గ్రేడ్ టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుకు సంబంధించి నిర్వహించిన పరీక్షా ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఫలితాల్లో ఖేడ్ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత సాధించిన 8వ తరగతి విద్యార్థులు చరణ్, నందకిషోర్, 9వ తరగతి విద్యార్థి విఘ్నేష్, 10వ తరగతి విద్యార్థి సమీరొద్దీన్, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఆసిఫ్, అనాస్‌లను ప్రిన్సిపాల్ రాములు, ఆర్ట్ టీచర్ రమేష్‌ను అభినందించారు. అనంతరం మెమోలు అందజేశారు.

ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టాలి

సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య

పటాన్‌చెరు టౌన్: జిల్లాలోని రసాయన పరిశ్రమల్లో ప్రత్యేక బృందాలతో సమగ్ర తనిఖీలు చేపట్టాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజయ్య మాట్లాడుతూ.. సిగాచి పరిశ్రమలో ప్రమాదం జరిగి నాలుగు రోజులు గడుస్తున్నా నేటి వరకు శిథిలాలను తొలగింపు పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పని నెమ్మదిగా జరుగుతుందని, ప్రభుత్వం వెంటనే వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని రసాయన పరిశ్రమల్లో ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చాలా పరిశ్రమల్లో పాత యంత్రాలు, అనుభవం లేని కార్మికులతో ప్రొడక్షన్ వద్ద పని చేయిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం రసా యన పరిశ్రమలను తనిఖీలు చేపట్టకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

తగ్గిన జ్వరాలు

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం లోంక తండాలో జ్వరాలు తగ్గుముఖం పట్టాయి. గురువారం తండాలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇటీవల తండాలో గిరిజనులు జ్వరాలు, సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారని స్థానికులు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అధికారుల ఆదేశాలతో సిర్గాపూర్ పీహెచ్‌సీ సూపర్‌వైజర్ చంద్రశేఖర్, వైద్య సిబ్బంది సురేఖ, రాంచందర్, తారసింగ్, తదితరులు తండాను సందర్శించారు.

రేపు పండరీపూర్‌కు ప్రత్యేక బస్సు

నారాయణఖేడ్: మహారాష్ట్రలోని పండరీపూర్ రుక్మిణీ పాండురంగ పుణ్యక్షేత్రంలో వారికార్ ఉత్సవాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. భక్తుల కోరిక మేరకు ఈనెల 5న శనివారం ఖేడ్ నుంచి పండరీపూర్‌కు ప్రత్యేకంగా సూపర్ ఎక్స్‌ప్రెస్ బస్సును నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. శనివారం సా. 6 గంటలకు ఖేడ్ నుంచి బస్సు బయలు దేరుతుందన్నారు. తిరుగు ప్రయాణంలో తుల్జాపూర్ మీదుగా సోమవారం సా.7 గంటలకు ఖేడ్‌కు చేరుకుంటుందని చెప్పారు. ఒక్కరికి ఛార్జీ రూ.2,200 టోల్‌గేట్, బార్డర్ ట్యాక్స్, పర్మిట్లు, పార్కింగ్ చార్జీ ఆర్టీసీ సంస్థ భరిస్తుందని వివరించారు.

చెట్ల కిందే భోజనాలు!

- శిథిలావస్థలో హత్నూర గురుకుల భోజనశాల
- రెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- చెట్ల కింద భోజనాలు చేస్తున్న 541 మంది విద్యార్థులు



వర్షంలోనే హత్నూర గురుకుల పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

హత్నూర(సంగారెడ్డి): గురుకుల పాఠశాల, కళాశాలలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని ప్రభుత్వాలు ఆర్భాటంగా ప్రకటిస్తున్నాయి.. క్షేత్ర స్థాయిలో విద్యార్థుల కష్టాలు వర్ణనాతీతం. భోజనశాల, వంటగది లేకపోవడంతో వర్షంలో చెట్ల కింద విద్యార్థులు భోజనం చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఈ సంఘటన మండల కేంద్రం హత్నూరలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కళాశాల, విద్యార్థులు వర్షంలో భోజనం చేస్తూ కనిపించడంపై ఆరా తీయగా ఎన్నో సమస్యలు సాక్షి దృష్టికి వచ్చాయి.

దశాబ్దాల క్రితం నిర్మించిన భోజనశాల, వంటశాల హాస్టల్ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి రెండేళ్లుగా మూతపడింది. అప్పటి నుంచి అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో పాఠశాల భవనం పక్కన రేకుల షెడ్‌లో వంట చేస్తూ ఆరుబయటే విద్యార్థులకు నిత్యం భోజనం పెడుతున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 640 మంది



మూతపడిన హత్నూర గురుకుల పాఠశాల భోజనశాల హాస్టల్

విద్యార్థులు చదువుకునేందుకు ఉన్నతాధికారులు అనుమతి ఇచ్చారు. కానీ ప్రస్తుతం 541 మంది విద్యార్థులు అడ్మిషన్ అయి చదువుకుంటున్నారు. రెండేళ్లుగా భోజనశాల, వంటశాల లేకపోవడంతో తమ పిల్లలు ఇబ్బందుల పడుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. మరుగుదొడ్ల సమస్య, నీటి సమస్య తీవ్రంగా ఉండడంతో విద్యార్థులు సతమతమవుతున్నారు. వసతి గృహంలో సైతం సౌకర్యాలు లేక వర్షం వస్తే విద్యార్థులు చలికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. రెండేళ్లుగా ఇబ్బంది పడుతున్న గురుకుల పాఠశాల, కళాశాల రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంపై సర్వత్ర విమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు గురుకుల విద్యావ్యవస్థపై దృష్టి పెట్టి హత్నూర గురుకుల పాఠశాలకు భోజనశాల, వంట గది హాస్టల్ భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వర్షంలోనే తింటున్నాం



భోజనశాల లేకపోవడంతో వర్షం పడినప్పుడల్లా వర్షంలోనే భోజనం చేయాల్సిన పరిస్థితి. రాత్రి సమయంలో ఆరు బయట తినాలంటే భయంగా ఉంది. త్వరగా భోజనశాల నిర్మించి సౌకర్యాలు కల్పించాలి. ఎవరికి చెప్పాలో తెలియడం లేదు. రెండేళ్లుగా భోజనశాలను మూతేశారు.

– యశ్వంత్ విద్యార్థి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



భోజనశాల, వంటశాల శిథిలావస్థకు చేరిన విషయం రాష్ట్ర అధికారులకు తెలియజేశాం. పూర్తిగా కూలిపోయే స్థితిలో ఉండడంతో భోజనశాల, వంటశాల హాస్టల్ గదులను రెండేళ్ల క్రితమే మూసేశారు. అప్పటి నుంచి ఆరుబయటే వంట చేసి విద్యార్థులకు భోజనం అందిస్తున్నారు. జనవరి 29వ తేదీ రాష్ట్ర గురుకుల సెక్రటరీ అలుగు వర్షిని వచ్చి పాఠశాల సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. త్వరలోనే భోజనశాల వంటశాల నిర్మించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులకు భోజనం తినడం ఇబ్బందిగా ఉంది.

– శంకర్, ప్రిన్సిపాల్

సర్కారు బడిలో టీచరు కొడుకు

నారాయణఖేడ్: కల్హేర్ మండలం బీబీపేటకు చెందిన గుండు మహేందర్ ఖేడ్ మండలం బాణాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఆయన కుమారుడు గుండు అభిజిత్ 4వ తరగతి చదువుతుండగా గురువారం తాను పని చేస్తున్న పాఠశాలలో చేర్పించారు. అభిజిత్ 1వ తరగతి నుంచి 3వ తరగతి వరకు ఖేడ్‌లోని ప్రభుత్వ పాఠశాలలోనే చదవడం గమనార్హం. తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న మహేందర్‌ను బాణాపూర్ గ్రామస్తులు అభినందించారు.



కుమారుడుతో మహేందర్

మహేందర్‌ను ప్రతీ ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని గ్రామ యువకులు పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

సంగారెడ్డి క్రైమ్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జైలుశిక్ష, జరిమానా విధించిన సంఘటన పట్టణ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంగారెడ్డి ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి కథనం ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి చౌరస్తా, పాత బస్టాండ్, బైపాస్‌లోని గుర్రపు బొమ్మ వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని గురువారం కోర్టులో హాజరుపరచగా జిల్లా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ ఒకరికి రెండు రోజులు జైలు శిక్ష, మిగతా ఇద్దరికి రూ.1500, మరో నాలుగురికి రూ.1000 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీస్‌లు పేర్కొన్నారు.

కంది విత్తనాలు పంపిణీ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని హుస్సెన్‌నగర్, న్యాల్‌కల్, చాల్కి, తదితర గ్రామాల్లో గురువారం కంది విత్తనాల పంపిణీ చేశారు. ఆహార భద్రత పథకం కింద మండలానికి 40 క్వింటాళ్ల ఎల్ఆర్‌జీ 52 రకం కంది విత్తనాలు వచ్చాయి. వాటిని ఏఓ అభినాష్ వర్మ, ఏఈఓలు ఆయా క్లస్టర్ల పరిధిలోని రైతులకు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

నూతన నియామకం

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పరిధిలోని విత్తన క్షేత్ర కార్యాలయం నూతన సహాయ వ్యవసాయ సంచాలకులుగా డాక్టర్ వైద్యనాథ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం విత్తన క్షేత్రం ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు శారదాదేవి, సంధ్య, విస్తరణ అధికారి సౌమ్య, సి బ్బంది సురేష్, వీరప్ప, సుదర్శన్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ రాస్తారోకో



జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న బాధితులు

నారాయణఖేడ్: రోడ్డు ప్రమాదంలో మరణించిన మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని బంధువులు, తండావాసులు ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రి ఎదుట 161బీ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. నాగల్‌గిద్ద మండలం గంగారాం తండా సమీపంలో బుధవారం రాత్రి ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఘటనలో మండలంలోని పత్తునాయక్ తండాకు చెందిన రాథోడ్ మారుతి (40), గంగారాం తండాకు చెందిన చౌహాన్ మారుతి (50) మృతి చెందారు. గురువారం ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. దీంతో బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యులు, బంధువులు, రాస్తారోకో, ఆందోళన చేశారు. రెండుగంటల పాటు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తెచ్చామని, మృతుల కుటుంబీకులకు న్యాయం జరిగేలా చూస్తామని సీఐ, ఎస్ఐలు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప గురువారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో అనేక కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని.. జలమండలి ఎండీ అశోక్ రెడ్డికి వివరించినట్లు చెప్పారు. అలాగే, కొద్దిరోజుల క్రితం సమస్య తెలిపిన వెంటనే డ్రైనేజ్ వ్యవస్థ ఆధునీకరణకు ప్రత్యేక నిధులు మంజూరు చేశారని అన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్

సంక్షిప్త వార్తలు

◆ **బుద్ధుడితో 'నా ప్రయాణం నాటక ప్రదర్శన'**

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని షెట్కార్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం రాత్రి సమతా సైనిక్‌దళ్ ఆధ్వర్యంలో 'బుద్ధుడితో నా ప్రయాణి' నాటక ప్రదర్శన నిర్వహించారు. అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ కళాకారులతో నిర్వహించిన నాటక ప్రదర్శన ఆకట్టుకుని ఆలోజింపచేసింది. బుద్ధుడు బోధించిన శాంతి సందేశం, ప్రజ్ఞ, శీల, కరుణ తదితర విషయాలను కళాకారులు ప్రదర్శన ద్వారా వివరించారు. కార్యక్రమంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమి చైర్మన్ కేకే రాజు, సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్, జిల్లా అధ్యక్షుడు కరణం రవికుమార్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్ గౌడ్, పలువురు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

◆ **మట్కా నిర్వాహకుల బైండోవర్**

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్‌కు చెందిన ఆరుగురు మట్కా నిర్వాహకులను తహసీల్దార్ దశరథ్ ఎదుట బైండోవర్ చేసినట్లు టౌన్ ఎస్ఐ.వినయ్‌కుమార్ తెలిపారు. పట్టణంలో మట్కా జూదం నిర్వహిస్తున్న వారిని గుర్తించి బైండోవర్ చేశామన్నారు. పట్టణంలోని రాంనగర్, శాంతినగర్‌లో మట్కా ఆడుతున్నట్లు సమాచారం మేరకు దాడులు చేసి నలుగురుని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రూ.9.700 నగదు, మట్కా చిట్టీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

◆ **రైతు సమస్యల పరిష్కారానికి కృషి**



సదాశివపేట(సంగారెడ్డి): రైతుల సమస్యల పరిష్కారమే మార్కెట్ పాలకవర్గ ప్రధాన లక్ష్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ సదాకుల కుమార్ పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో గురువారం మార్కెట్ చైర్మన్ సదాకుల కుమార్ అధ్యక్షతన మార్కెట్ పాలకవర్గ సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మార్కెట్ అభివృద్ధికి రూ.2 కోట్ల 66 లక్షల నిధుల కోసం జిల్లా మార్కెటింగ్ అధికారి ఎండీ రియాజ్‌తో ఆమోదంపై చర్చించి వినతిపత్రం అందజేశారు. అనంతరం హమాలీలకు లైసెన్సులు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, డైరెక్టర్లు శివకుమార్, శైలేందర్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, సయ్యద్‌యూసుఫ్, నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండండి

మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్

నారాయణఖేడ్: వర్షాకాలం వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. మున్సిపాలిటీ వాసులు అప్రమత్తంగా ఉంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ పేర్కొన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో పారిశుద్ధ్య పనులు, తడి, పొడి చెత్తపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించగా గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరంగా పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా కొనసాగిస్తున్నామన్నారు. దోమలు ప్రబలకుండా నిల్వ ఉన్న నీళ్లల్లో, మురుగు కాల్వల్లో రసాయన ద్రావణాన్ని పిచికారీ చేయిస్తున్నామన్నారు. ఆయన వెంట పారిశుద్ధ్య అధికారి శ్రీనివాస్, వార్డు అధికారులు ఉన్నారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న జగ్జీవన్

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

సంగారెడ్డి క్రైమ్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి.. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పట్టణ ట్రాఫిక్ సీఐ రామకృష్ణారావు హెచ్చరించారు. పట్టణంలోని పోతిరెడ్డి పల్లి చౌరస్తా వద్ద వాహనదారులు ఇష్టానుసారంగా రోడ్లపై అక్రమ పార్కింగ్ చేయడం. రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్స్ జంప్ చేసే వాహనాదారులపై కఠిన చర్యలు తప్పవన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారం పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన రహదారులపై, ప్రధాన జంక్షన్ల వద్ద ఉదయం, సాయంత్రం ఆటోలు, స్కూల్ బస్సులను తనిఖీలు చేస్తున్నామని వివరించారు. స్కూల్ బస్సు డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి జిల్లా న్యాయస్థానంలో హాజరుపరుస్తామని సీఐ హెచ్చరించారు.



సీఐ రామకృష్ణారావు

జాతర కరపత్రం ఆవిష్కరణ

సంగారెడ్డి : ఆషాఢ మాసబోనాల జాతరను ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ముదిరాజ్ ముద్దుబిడ్డ పులిమామిడి రాజు ప్రోత్సాహంతో ప్రతి ఏటా బోనాల జాతర ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సారి కనీవినీ ఎరుగని రీతిలో బోనాల ఉత్సవం నిర్వస్తామన్నారు. ఈ కార్యక్రమం పాత బస్టాండ్ వద్ద గల సంగమేశ్వర ఆలయంలో బోనాల అలంకరణ ఏర్పాటు చేసి అక్కడి నుండి అమ్మవారి కి బోనాలు ఊరేగింపు, పోతురాజుల విన్యాసం, ఫలహారం బండి వివిధ సంస్కృతి కార్యక్రమాలతో బోనాల జాతర నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు తెలుగు జనార్దన్, ప్రధాన కార్యదర్శి పిట్ల రమేశ్, కోశాధికారి చంద్రశేఖర్, అసోసియేట్ అధ్యక్షుడు రాములు, ఉపాధ్యక్షుడు తిరుమలరావు, ఎస్‌వి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి ఆర్కే రామకృష్ణ, నాయకులు కృష్ణ, కేశవులు కొత్తపూర్ శ్రీనివాస్, నాగరాజు తదితరులు ఉన్నారు.



బోనాల కరపత్రాన్ని ఆవిష్కరించిన నాయకులు

పాఠాలను విద్యార్థులతో చదివించాలి

మునిపల్లి(అందోల్): బోధించిన పాఠ్యాంశాలను ప్రతి విద్యార్థితో చదివించడమే కాకుండా బోర్డుపై రాయించాలని ఎంఈఓ ఛీంసింగ్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండల కేంద్రం మునిపల్లిలో హరిజనవాడ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. అంతకుముందు పాఠశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను విద్యార్థులచే చదివించారు. ధైర్యంగా, భయపడకుండా బోర్డుపై రాసిందే తిరిగి మీ తోటి విద్యార్థులకు చెప్పాలన్నారు. అప్పుడే భయం పోవడమే కాకుండా పాఠ్యాంశాలు గుర్తుంటాయన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శరణమ్మ, ఉపాధ్యాయులు దుర్గయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థితో పాఠాలను చదివిస్తున్న ఎంఈఓ

అరుణాచలగిరి ప్రదర్శనకు ప్రత్యేక బస్సులు

డీఎం ఉపేందర్

సంగారెడ్డి టౌన్: తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదర్శనకు ఉమ్మడి మెదక్ జిల్లాలోని సంగారెడ్డి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్ తెలిపారు. ఆయన మాట్లా డుతూ.. ఈనెల 8న మధ్యాహ్నం 12 గంటలకు సంగారెడ్డి నుంచి అరుణాచలం బయలుదేరి అక్కడి నుంచి మహానంది అనంతరం జూలై 11న సంగారెడ్డి చేరుకుంటుందన్నారు. ఒక్కొక్కరికి టూర్ ప్యాకేజీ రూ. 4,500 ఉంటుందని.. సంస్థ అధికార వెబ్‌సైట్ నుంచి రిజర్వేషన్ చేసుకో వచ్చున్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లను 9959226267, 7382831120, సంప్రదించాలని సూచించారు.

జోగిపేట డిగ్రీ కళాశాల వద్ద నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

జోగిపేట(అందోల్): ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో మేరకు జోగిపేటలో డిగ్రీ కళాశాల వద్ద గురువారం నిరసన చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు రియింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని జిల్లా అధ్యక్షుడు ఎం సురేష్ డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం పక్కాగా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తానని ప్రకటించిన రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా ఆ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తుందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ చదివే విద్యార్థులకు నేరుగా విద్యార్థుల అకౌంట్లోనే రీయింబర్స్‌మెంట్ డబ్బులను వేస్తామని చెబుతుందన్నారు. ఫీజు రియింబర్స్‌మెంట్ డబ్బులను ముందే విద్యార్థుల దగ్గర ప్రైవేట్ డిగ్రీ కాలేజీలు ముక్కు పిండి వసూలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ నాయకులు గణేష్, దినేష్, సన్నీ, భూమేష్, హర్షత్, కీర్తన, దీపిక, పల్లవి, రాజేష్, శ్రీకాంత్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.